మము బ్రోవవే తల్లీ..మహిషాసురమర్దినీ!

క్లుప్తంగా

ప్రజలకు దసరా శుభాకాంక్షలు



డాక్టర్ దార సుధీర్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్, పార్టీ రాష్ట్ర యువ జన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ప్రజలు ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో తులతుగేలా అమ్మవారు ఆశీర్వదించాలన్నారు. కూలీలు, కార్మికులు, కర్షకులు, రైతులు, ఉద్యోగులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీశైలం టెంపుల్: దసరా ఉత్సవాల సందర్భంగా శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ జయప్రదారామమూర్తి, వారిచే వేణుగానం, ఉమా శ్రీరామ్, బృందం వారిచే భక్తిరంజని కార్యక్రమాలు నిర్వహించారు. రాయచోటికి చెందిన ప్రమీలా భాగవతారిణి వారిచే శివ కల్యాణం హరికథ వినిపించారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది కార్యక్రమాలు


శ్రీశైలంటెంపుల్: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సంఘ్ సంచాలక్ (ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్) పిలుపు మేరకు శతాబ్ది కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం శ్రీశైలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా గణవేష్(ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫాం ధరించి) ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైస్కూల్ గ్రౌండ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. నరసరావుపేట ప్రాంత సహ బౌద్ధిక్ ప్రముఖ్ రామకృష్ణ, ప్రముఖ వ్యాపార వేత్త కొత్తా వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు.

ఆయుధ పూజ


ఆయుధాల పూజలో పాల్గొన్న సీఐ రాము, పోలీసు సిబ్బంది

ఆత్మకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాము ఆధ్వర్యంలో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, విజయదశమి పండగ అందరికీ కలిసి రావాలని ఆయన ఆకాంక్షించారు.

హైర్ బస్సు డ్రైవర్లకు జీతాలు పెంచాలి


ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆత్మకూరు: హైర్ బస్సు డ్రైవర్లకు జీతాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి.రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు, హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్స్ వారికి వారు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో హైర్ బస్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు మౌలాలి, కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు రాముడు, సహాయ కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


జూపాడుబంగ్లాలో మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు

జూపాడుబంగ్లా: దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల వ్యాప్తంగా బుధవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అందులో భాగంగా జూపాడుబంగ్లాలోని సరస్వతీదేవి, తాటిపాడులోని అమ్మవారు మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారు మహిషాసురుడు అనే రాక్షసున్ని సంహరించి మహిషాసురమర్దినిగా పేరొందినట్లు అర్చకులు లక్ష్మీనరసింహ శర్మ, మురళిమోహన్ తెలిపారు. మహిషాసుర మర్దిని అమ్మవారిని మనసారాసేవించి కొలిచిన వారికి భయం తొలగిపోయి, సర్వరోగాలు, పాపాలు హరించిపోతాయన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకం, మహాచండీయాగం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్, విద్యుత్ ఉపకేంద్రం కార్యాలయాల్లో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయుధ పూజలు నిర్వహించారు.


కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు


అశ్వవాహనంపై కామేశ్వరీదేవి

మహానంది: దసరా ఉత్సవాల సందర్భంగా స్థానిక శతచండీయాగశాలలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, పండితులు, రుత్వికులు విశేష పూజలు నిర్వహించారు. కామేశ్వరీదేవి అమ్మవారు పదోరోజు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, ఎం.నీలకంఠేశ్వరరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.



- కొత్తపల్లి: మండల పరిధిలోని కొలనుభారతి దేవి అమ్మవారు మహిషాసురమర్దిని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి పంచామృత సహిత పంచసూక్తములతో అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మహానైవేద్యం, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని సప్తశివాలయాల్లో దేవతామూర్తులకు భక్తులు విశేష పూజజు నిర్వహించారు.


నందికొట్కూరులోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో..

నందికొట్కూరు: పట్టణంలోని శ్రీ చక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. చౌడేశ్వరి దేవి ఆలయంలో మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మిడుతూరులోని వాసవీ కన్యకా అమ్మవారు కూడా మహిషాసుర మర్దిని దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.


ఆత్మకూరులో..

ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు సిద్ధిదాయినిదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరిదేవి అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయాల్లో పార్వతీమాత మహిషాసురమర్దిని అలంకరణతో, అంభా భవానీ, సాయిబాబా, అయ్యప్పస్వామి ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జంబులమ్మదేవి ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు.


వెలుగోడులో..

వెలుగోడు: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని భవానీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి సింహవాహనంపై త్రిశూలధారణతో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు.

బండిఆత్మకూరు మండలంలోని ఓంకార క్షేత్రంలో కొలువైన ఉమా మహేశ్వరీదేవి బుధవారం మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఓంకార క్షేత్రానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఓంకార సిద్ధేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకోత్సవం నిర్వహించారు. – బండి ఆత్మకూరు





- పాములపాడు: స్థానిక చౌడేశ్వరి దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, కలశారాధన పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించారు.

- పగిడ్యాల: మండల కేంద్రంలోని బంగ్లా శివాలయంలో పార్వతీదేవి అమ్మవారిని మహిషాసుమర్దిని రూపంలో అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, పుష్పార్చన, అన్నదాన కార్యక్రమాలు చేపట్టి భక్తిని చాటుకున్నారు. పాప పరిహారం కోసం అమ్మవారి లలిత సహస్త నామ పారాయణం చేశారు.



శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

- దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

శ్రీశైలంటెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం ఒకే ప్రాంగణంలో ఉన్న మహాపుణ్యక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం అమ్మవారి ఆలయంలో శ్రీశైలం ది కైలాస ఆన్ ఎర్త్ పేరుతో ఆంగ్లంలో రూపొందించిన కాఫీ టేబుల్ పుస్తకాన్ని, దేవస్థానం రూపొందించిన అయిదు రకాల 2026 సంవత్సర క్యాలెండర్లను, తంత్ర సముచ్ఛయం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం

ఆగమ గ్రంథాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని పర్యటనతో దేవస్థానానికి అటవీశాఖ మధ్య ఉన్న 5,362 ఎకరాల భూవివాదానికి పరిష్కారం లభిస్తుందన్నారు.

జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో మత్స్యరంగానికి మేలు

- మత్స్యశాఖ జాయింట్ డెరెక్టర్ హీరా నాయక్

వెలుగోడు: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో మత్స్యరంగానికి మేలు జరుగుతుందని మత్స్యశాఖ జాయింట్ డెరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ హీరా నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన చేపలు, రొయ్యలు, చేప నూనెలు, సేంద్రియ సారములపై జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారన్నారు. ఆక్వాకల్చర్ పరికరాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఫిషింగ్ గేర్, అమోనియా, సూక్ష్మ పోషకాలు, ప్రాసెసింగ్ సేవలపై కూడా జీఎస్టీ తగ్గింపు వర్తిస్తుందన్నారు.

- సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రేగడగూడూరు గ్రామంలో ట్రాక్టర్లతో వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఏఓ స్వాతీ, రేగడగూడూరు పశు వైద్యాధికారి సుమన్ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపల్లి: కేంద్రప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అమిరున్నీసా బేగం సూచించారు. బుధవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ట్రాక్టర్లు, యంత్రపరికరాలపై 5 శాతం నుంచి 12 శాతం వరకు ధర తగ్గింపు ఉంటుందన్నారు. అంతకు ముందు ట్రాక్టర్‌తో ర్యాలీ నిర్వహించారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేడీ హీరా నాయక్

- బండి ఆత్మకూరు: ఏఓ ఆర్.పవన్ కుమార్ ఆధ్వర్యంలో బి.కోడూరు గ్రామంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించి వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీ తగ్గినట్లు రైతులకు అవగాహన కల్పించారు.
- ఆత్మకూరు: పట్టణంలో ఏఓ హేమలత ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సమ సమాజాన్ని నిర్మిద్దాం

వెలుగోడు: కులాల గోడల్ని కూల్చివేసి సమ సమాజాన్ని నిర్మిద్దామని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఆనంద్ కోరారు. సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలి సంఘం నాయకులు బండి వెంకటేశ్వర్లు, ఎం తిరుపాలు, బి నాగరాజు, రమణ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య బుధవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శ్మశాన వాటికను కబ్జా చేశారని గ్రామ దళితులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

- జూపాడుబంగ్లా: మండలానికి 4,933 పింఛన్లు మంజూరు బుధవారం సాయంత్రానికి 4,656 పింఛన్లు పంపిణీ చేసినట్లు డిప్యూటీ ఎంపీడీఓ పద్మావతి తెలిపారు.
- ఆత్మకూరు: పట్టణంలోని 4896 పింఛన్‌లకు గానూ 4672 పింఛన్లను పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న 3,860 పింఛన్లకు గానూ 3,569 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నాగేంద్రుడు తెలిపారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గిత్త జయసూర్య క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు పాల్గొన్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే భూముల రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. బుధవారం లక్ష్మాపురంలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రీ సర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్(సర్వే) మురళీ, సర్పంచ్ సుజాత పాల్గొన్నారు.

- ఆత్మకూరు: రీసర్వేపై మండలంలోని కురుకుంద గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రత్నరాధిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న వారు రీ సర్వేలో పరిష్కరించుకోవాలన్నారు.

బంతిపూలు.. రూ.120



నందికొట్కూరు: దసరా పండుగ సందర్భంగా బంతిపూలకు, మామిడి ఆకులకు భలే గిరాకీ తగిలింది. బుధవారం పటేల్ సెంటర్‌లో మామిడి ఆకు కోసం ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో పాత బస్టాండ్, పటేల్ సెంటర్, రబ్బానీ కాంప్లెక్స్, బాలాజీ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయాయి. బంతిపూలు కిలో రూ.120 పలికాయి.

లియాఫీ ఆవిర్భావ దినోత్సవం

ఆత్మకూరు: స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో ఆత్మకూరు లియాఫీ ప్రధాన కార్యదర్శి ఎస్.సాయిబాబు ఆధ్వర్యంలో లియాఫీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు విజయ్‌కుమార్, రవికుమార్, డీఓ సంఘం నాయకులు జగన్నాథరాజు, కరీమ్, రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరగా పూర్తిచేయండి

జూపాడుబంగ్లా: ఉపాధి కూలీల ఈకేవైసీని పూర్తిచేయాలని ఇన్‌చార్జ్ ఏపీడీ దాసు ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

- సమస్యాత్మకంగా మారిన తాటిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ ప్రక్రియ జిల్లా అధికారుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఏపీఓ రేష్మ తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే జయసూర్య బుధవారం స్మార్టు రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్‌కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను డీలర్లు స్కాన్ చేసిన వెంటనే కార్డుదారుడి కుటుంబ వివరాలు డిస్‌ప్లే అవుతాయన్నారు. కుటుంబ సభ్యుల వేలిముద్రలు, ఐరీష్ తీసుకుని నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

- ఆత్మకూరు: ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రతి కార్డుదారుడు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రత్నకుమారి సూచించారు. బుధవారం ఆత్మకూరులోని కిషన్ సింగ్ కాలనీ, ఎస్‌పీజీ పాలెం, ఏబీఎం పాలెం, కురుకుంద గ్రామాల్లోని కార్డుదారులకు తహసీల్దార్ స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.
- వెలుగోడు: నిత్యావసర సరుకుల పంపణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందని తహసీల్దార్ శ్రీనివాసగౌడు అన్నారు. బుధవారం పట్టణంలో స్మార్ట్ కార్డులను, పింఛన్లను ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పంపిణీ చేశారు.